



సువర్ణసౌధ పర్యవేక్షణకు

ఏడాదికి రెండున్నర కోట్లు


బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని బెంగళూరులో విధానసౌధకు దీటుగా బెళగావిలో నిర్మించిన సువర్ణసౌధ పర్యవేక్షణకు ఏడాదికి రెండున్నర కోట్ల రూపాయలు అవసరం కానుందని జిల్లా అధికారి ఓ నివేదిక సిద్ధం చేశారు. ఈ ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో శాసనసభ శీతాకాల సమావేశాలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బెళగావిలోని సువర్ణ సౌధలో సమావేశాలు జరగనున్నాయి. సువర్ణసౌధ పర్యవేక్షణకు ఏటా రెండున్నర కోట్లు ఖర్చు కానుందని జిల్లా అధికారి మహ్మద్ రోషన్ తెలిపారు. సువర్ణసౌధలో సమావేశాలు నిర్వహించేందుకు పీడబ్ల్యూడీ ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం శాసనసభ సమావేశాల తేదీలను ప్రకటించాక ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. ఇటీవలే జిల్లాకు చెందిన కొన్ని కార్యాలయాలను సువర్ణసౌధకు తరలిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా నిరంతరం సువర్ణసౌధకు సందర్శకులు వస్తుంటారన్నారు.




విశ్వవిఖ్యాతి..!

- తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు రూపశిల్పి..
- కీలక ప్రాజెక్టులతో రైతులకు చిరస్మరణీయుడు
- నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వఖ్యాతి గాంచిన విశ్వేశ్వరుడు ఆయన..ఎన్నో కీలక ప్రాజెక్టులకు..చారిత్రక కట్టడాలను రూపొందించిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ప్రాజెక్టు నిర్మిస్తే దశాబ్దాలపాటు లక్షలాదిమంది రైతులకు జీవనం సాగుతుందని, ఓ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉద్యోగం, సమాజానికి ఆదాయం సమకూరుతుందని శతాబ్దం క్రితమే ఆలోచించిన అనితరసాధ్యుడు, చిరస్మరణీయుడు భారతరత్న సర్ ఎం విశ్వేశ్వరయ్య. ఒక కన్నడిగుడిగా ప్రతి పౌరుడు విశ్వేశ్వరయ్యను కొనియాడే తరహాలోనే దేశం మొత్తంఆయనను స్మరించుకుంటారు. నాటికీ నేటికీ రేపటికీ ప్రతి ఇంజనీరుకు విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడు. బెంగళూరుకు అనుబంధంగా ఉండే చిక్కబళ్ళాపుర తాలూకా ముద్దేనహళ్ళిలో 1861 సెప్టెంబరు 15న జన్మించిన విశ్వేశ్వరయ్య పూర్వీకులది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మోక్షగుండం. చిక్కబళ్ళాపురలో ప్రాథమిక విద్యను, బెంగళూరులో ఉన్నత విద్యను పూర్తి చేసి మద్రాస్ యూనివర్సిటీలో బీఏ, పూనె సైన్స్ కాలేజ్‌లో ఇంజనీరింగ్ చదివారు. 23వ ఏట ముంబైలో ప్రజాపనులశాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరి ఆ తర్వాత భారత నీటిపారుదల శాఖలో అవకాశం దక్కడంతో అటు వెళ్లారు. డెక్కన్ ప్రాంతంలో నీటిపారుదల వ్యవస్థను రూపొందించారు. నీటి ప్రవాహానికి తగినట్లుగా ఆనకట్టలు ప్రమాదం కలగకుండా నీటిని నిల్వ చేసే ఆటోమేటిక్ వరదగేట్‌లను రూపొందించారు. 1906లో భారత ప్రభుత్వం తరపున యెమెన్ దేశంలోని ఆడెన్‌కు వెళ్లి అక్కడి నీటి పారుదల, మురుగు కాలువల వ్యవస్థను రూపొందించారు. హైదరాబాద్ నగరాన్ని వరదలనుంచి రక్షించడానికి వ్యవస్థ రూపొందించిన ఘనత ఆయనదే. 1908లో స్వచ్ఛంద పదవీ విరమణ పొంది మైసూరు సంస్థానంలో దివాన్‌గా చేరారు. రాష్ట్రంలో చారిత్రాత్మకమైన ప్రాజెక్టులను రూపొందించారు. మైసూరు సోప్ ఫ్యాక్టరీ, పారాసిటాయిడ్ ల్యాబొరేటర్, శివమొగ్గ జిల్లా భద్రావతిలో విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీ, బెంగళూరు యూనివర్సిటీ, జయచామరాజేంద్ర పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూరు, సెంచరీ క్లబ్, మైసూరు చాంబర్ ఆఫ్ కామర్స్, విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటులోనూ కీలకంగా వ్యవహరించారు. కావేరి నదికి అనుబంధంగా లక్షలాది ఎకరాలలో సాగునీరు, కోట్లాదిమందికి తాగునీరు కల్పించిన కేఆర్ఎస్ ప్రాజెక్టుకు చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించారు. తిరుమల తిరుపతి ఘాట్‌రోడ్డు కూడా ఆయన సారథ్యంలో సాగినవే. ప్రస్తుతం బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ ద్వారా ఏటా వేలాదిమంది ఇంజనీరింగ్ చదువుతున్నారు. భారతప్రభుత్వం సర్, భారతరత్న వంటి అరుదైన గౌరవాలను అందించింది. బ్రిటీష్ ప్రభుత్వం నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ అనే బిరుదును ఇచ్చింది. ఆయన స్వగ్రామం ముద్దేనహళ్ళిలలో విశ్వేశ్వరయ్య మెమోరియల్ ట్రస్టు ద్వారా ఆయనను స్మరించుకునేలా ఏర్పాట్లు చేశారు.





బీజేపీ ఎమ్మెల్యే బెదిరిస్తున్నారు

- సీఎం సిద్ధరామయ్యకు బీబీఎంపీ కాంట్రాక్టర్ ఫిర్యాదు
- ఎమ్మెల్యే మునిరత్నను అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వకపోతే ప్రాణాలు తీస్తామని బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న బెదిరిస్తున్నారని బీబీఎంపీ కాంట్రాక్టర్ చలువరాజ్ ఆరోపించారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవినగర్ వార్డులో దేవరాజ్ అరసు ట్రక్ టర్మినల్ ప్రాంతంలో చెత్త సేకరణ, విభజన పనులు చేసేందుకు ఎమ్మెల్యే మునిరత్న రూ.30 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వనందుకు తనను ఇంటికి పిలిపించి బెదిరించారని అన్నారు. చెప్పినట్లు వినకపోతే చిత్రదుర్గ రేణుకాస్వామిని చంపేసినట్లు చంపుతామని బెదిరించారని అన్నారు. తనను కులం పేరిట దూషించారని, తన భార్య ఫొటో చూపించాలని అసభ్యంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య ఫొటోను చూసి మంచానికి పంపాలని అన్నారని, తన తల్లి గురించి అసహ్యంగా మాట్లాడారని ఆరోపించారు. బీబీఎంపీలో లారీ క్లీనర్, డ్రైవర్‌గా పనిచేసిన తాను ప్రస్తుతం కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నానని తెలిపారు. ఎమ్మెల్యే పీఏ కుమార్ తనకు ఫోన్ చేసి బెదిరించారని ఆరోపించారు. 'మాకు తెలియకుండానే పనులు తీసుకుంటావా..?' అని ఆగ్రహం వ్యక్తం చేశారని, పలుమార్లు తనపై దాడి చేశారని, టెండర్లను రద్దు చేయించారని ఆరోపించారు. ఎమ్మెల్యే మునిరత్నను తాము ఎదుర్కోలేమని, ఆయన ఏమైనా చేయగల సమర్థుడని, తన ప్రాణాలకు హాని ఉందని అన్నారు. సీఎం సిద్ధరామయ్య, హోం మంత్రి పరమేశ్వర్, పోలీస్ కమిషనర్ దయానంద్‌ను కలసి ఫిర్యాదు చేస్తానని అన్నారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యే నివసించే ప్రాంతంలోని వయ్యాలి కావల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌తో మునిరత్న మాట్లాడినట్లు ఉన్న ఆడియోలు వైరల్ అయ్యాయి.


సీఎంకు ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్ చలువరాజ్

సీఎంను కలిసిన కాంట్రాక్టర్


కాంట్రాక్టర్ చలువరాజ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి బీజేపీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. తనకు బెదిరిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ, బీజేపీ సంస్కృతి ఎలాంటిదో తెలిసిందేనని అన్నారు. ఎమ్మెల్యే మునిరత్న నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. మాజీ ఎంపీ డీకే సురేశ్ తీవ్రంగా స్పందించారు. కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేయడమే కాకుండా ప్రాణాలు తీస్తామని బెదరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శ్రీరాముడి జపం చేసే వీరు.. సిగ్గులేకుండా మహిళలను మంచానికి పిలుస్తారా అని మండిపడ్డారు. మునిరత్నను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని, ఆయనపై సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ఎమ్మెల్యే మునిరత్న శుక్రవారం సాయంత్రం నుంచి ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని అందుబాటులో లేకుండాపోయారు. ఆ తరువాత శనివారం ప్రత్యక్షమయ్యారు. ఆడియోలో ఉన్న వాయిస్ తనదని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.

ఎమ్మెల్యే అరెస్ట్




కాంట్రాక్టర్ చలవరాజును బెదిరించి కులం పేరుతో దూషించిన కేసుల్లో కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నను పోలీసులు కోలార్‌లో శనివారం అరెస్టు చేశారు. మునిరత్నపై బాధితుడి ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేశారు. చంపేస్తామని బెదిరించి నందుకు ఎమ్మెల్యేతో పాటు ఆయన పీఏ వీజీ కుమార్, సెక్యూరిటీ అధికారి అభిషేక్ మరో వ్యక్తి వసంత్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. కులం పేరుతో దూషించినందుకు ఎమ్మెల్యేపై భారతీయ న్యాయసంహిత కింద మరో కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే తీరుపై దళిత సంఘర్షణ సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. దళితుడైన కాంట్రాక్టర్‌ను కులం పేరుతో దూషించడాన్ని తప్పుబట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే మునిరత్న నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన ఇంటికి వెళ్లే మార్గాలలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.









సిబిల్ స్కోర్ లేకున్నా అన్నదాతకు రూ.10 లక్షల రుణం

- పంట రుణాలపై బ్యాంకులు నిబంధనలు సడలించాలి : కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సిబిల్ స్కోర్ లేకున్నా, ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అన్నదాతలకు రూ.10లక్షల దాకా పంటరుణం ఇచ్చేలా ఆర్‌బీఐ మార్గదర్శకాలు ఉన్నాయని, బ్యాంకులు పాటించాల్సి ఉందని కేంద్ర వినియోగదారులు, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. శనివారం ధారవాడలో జిల్లా అధికారి కార్యాలయంలో జిల్లా ప్రగతి పరిశీలన సభలో ఆయన పాల్గొన్నారు. రైతులు సమస్యల్లో ఉన్నారన్నారు. అనవసరంగా కొన్ని బ్యాంకులు పంటరుణాలు ఇచ్చేందుకు సిబిల్ స్కోర్ ప్రస్తావిస్తోందన్నారు. రైతులకు కొన్ని నిబంధనలు సడలించాలని ఆయన కోరారు. తద్వారా రైతులకు పంట రుణం పొందడం కష్టంగా మారుతోందని, ఆహార ఉత్పత్తులపైనా ప్రభావం చూపనుందన్నారు. కేంద్రప్రభుత్వం వ్యక్తిగత, గ్రూపులవారీగా పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ ప్రభుదేవ, జిల్లా అధికారి దివ్యప్రభు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా సమీక్ష సమావేశంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి






ఎన్నికల్లో పోటీ చేయను: మంత్రి రాజణ్ణ



బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేసేది లేదని మధుగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర సహకారశాఖ మంత్రి రాజణ్ణ వెల్లడించారు. తుమకూరులో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఇకపై ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేసే ఆలోచన లేదన్నారు. ఎమ్మెల్యేతోపాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నానన్నారు. అయితే క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతానని, అవసరమైనవారిని గెలిపిస్తానన్నారు. నచ్చకుంటే ఓడించి తీరుతానన్నారు. మధుగిరిని జిల్లా కేంద్రం చేయాలనే ప్రయత్నం కొనసాగిస్తానన్నారు. తన అధికారం ముగిసేలోగా మధుగిరిని జిల్లాను చేస్తానన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పనులు చేయడం లేదని, నియోజకవర్గ అభివృద్ధి తన ఆశయమన్నారు. మధుగిరి నుంచి 2023 ఎన్నికల్లో 91,166 ఓట్ల మెజారిటీతో జేడీఎస్‌కు చెందిన ఎంవీ వీరభద్రయ్యపై గెలుపు సాధించారు. 2018లో వీరభద్రయ్య చేతిలో ఓటమి చెందారు. రాజణ్ణ విలక్షణమైన రాజకీయ నాయకుడు. తప్పు ఎవరు చేసినా, ఎంతటివారైనా సొంత పార్టీలో అగ్రస్థానంలో ఉన్నా విమర్శలు చేస్తారు. ముక్కుసూటిగా మాట్లాడేతత్వం కలిగినవారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.97	1,621.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	25,060	1895
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	21,356	9,940
సామర్థ్యం (టీఎంసీలు)	101.66	67.08

కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం

● న్యాయాధికారి కేజీ శాంతి



బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 14: పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుని వ్యయప్రయాసాలు తగ్గించుకోవాలని జిల్లా చట్టసేవ ప్రాధికార అధ్యక్షులు, జిల్లా కోర్టు సెషన్స్ కోర్టు న్యాయాధికారి కేజీ శాంతి సూచించారు. తాలూరు రోడ్డులోని జిల్లా కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉభయ జిల్లాలైన బళ్ళారి, విజయనగర జిల్లాల్లో 31 న్యాయస్థానాల్లో 64,811 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 12,438 కేసులు రాజీతో పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఆసక్తిగా ఉన్నట్లు, వాటిలో కొన్ని రోజులుగా న్యాయాలయం అధికారులు, సంధానకారులు కక్షిదారులను ఒప్పించి 7,568 కేసులు రాజీ చేసి పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 2,36,000 కేసులు రాజీ మార్గం గుండా పరిష్కరించుకున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో 10వేలకు పైగా కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా చట్టసేవా ప్రాధికర మెంబరు సెక్రటరీ రాజేశ్ ఎన్.హొసమనెలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో శాంతిసభ



మాట్లాడుతున్న సీఐ సుభాష్ చంద్ర

బళ్లారిరూరల్, సెప్టెంబరు 14 : నగరంలో కౌల్ బజార్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఈద్ మిలాద్ శాంతిసభను సభను నిర్వహించారు. సమావేశంలో సీఐ సుభాష్ చంద్ర మాట్లాడుతూ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని బైకు ర్యాలీలు, బ్లాక్ జెండాలు తదితర వాటిని జరపడం నిషేధమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఉమర్‌ఖాన్ అయాజ్, కార్పొరేటర్ అల్లాబకాష్, ఎస్ఐ లారెన్స్, ఎస్టీ వీరేష్, ఉమేష్ ముస్లిం మత గురువులైన తరువాత ముస్లిం కుల బంధువులు ఈ శాంతిసభలో పాల్గొన్నారు.

నల్లముచ్చు దాడి

కంప్లి, సెప్టెంబరు 14: పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీలో నల్లముచ్చు కోతి దాడులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలుపుతున్నారు. షుగర్ ఫ్యాక్టరీలోని ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రావాలన్నా వెనుకంజ వేస్తున్నారు. పురసభ అధికారులు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించి నల్లముచ్చు కోతిని బంధించి వాటి బెడద నుంచి కాపాడాలని కోరారు.



పాఠశాలలో నల్లముచ్చుకోతి

నేడు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

● నగరంలో భారీ మానవహారం ● ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, సెప్టెంబరు 14: అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం నిర్వహించే భారీ మానవహారంలో అందరూ పాల్గొనాలని డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం నగర జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సమానత్వం, ఐక్యత, మనమంతా ఒక్కటే అనే భావన ఉండాలన్నారు. ప్రతి పౌరుడికి ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనుందన్నారు. మానవహారం నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, సంఘాల ఆఫీస్ బేరర్లు, వివిధసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, స్త్రీశక్తి స్వయం సహాయక సంఘాలు, రోటరీ సంస్థల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. భువనహళ్ళి, సండూర్‌లోని కురేకుప్ప, వడ్డు, బన్నిహట్టి, లింగదహళ్ళి, ఉబ్బలగుండి, రాజాపూర్, మల్లాపూర్,సాతేగుడ్డ,విజయనగరం జిల్లా సరిహద్దులో 32,000 మందికి పైగా ప్రజలు, విద్యార్థులు మానవహారం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. దాదాపు 45.9 కి.మీ పొడవునా జరిగే మానవహారంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజా స్వామ్యానికి మద్దతు పలకాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రతి 100మీటర్లకు ఒక అంగన్‌వాడీ టీచర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆశా వర్కర్, ఏఓడబ్ల్యూని నియమించినట్లు తెలిపారు. బస్సులు, మైనింగ్ వాహనాలు, పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ఇతర వాహనాలపై జిల్లా పాల ఉత్పత్తి విభాగం ద్వారా సరఫరా అవుతున్న ఉత్పత్తుల ప్యాకెట్లపై 1000 పోస్టర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు, చిన్నారుల ప్రయోజనాల కోసం ఆరోగ్యం, భద్రత తదితర ఏర్పాట్లు చేయడంతో పాటు పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులు, తాలూకా స్థాయి అధికారులను, నోడల్ అధికారులుగా నియమించారు. మానవహారం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు 3000 జెండాలు, పిల్లలకు రిబ్బన్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పది విభిన్న సంస్కృతులను కళా బృందాలు ప్రదర్శిస్తాయన్నారు. దారిపొడువునా 2వేల మొక్కలను నాటాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు,



పోస్టర్లను విడుదల కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

అండర్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, అధికారులు విధిగా పాల్గొనాలన్నారు. అనంతరం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

విజయనగర జిల్లాలో..

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మావనహారం కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు విజయనగం జిల్లా కలెక్టర్ దివాకర్ తెలిపారు. హొసపేట జిల్లాకలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించి ప్రజాస్వామ్య ఐక్యతకు, బలానికి, సామరస్యానికి ప్రతీకగా ప్రభుత్వం మానవహారం ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలోని హైస్కూల్, హాస్టల్, కళాశాల విద్యార్థులు, సంజీవిని, ఎన్ఆర్ఎల్ఎం, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవంతమైన మానవ గొలుసు కోసం ప్రతి 100మీటర్లకు ఒక సెక్టార్ అధికారి,నోడల్ అధికారిగా జిల్లా స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను నిర్దేశించిన ప్రదేశానికి చేర్చేందుకు పాఠశాల వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లాపోలీసు సూపరింటెండెంట్ శ్రీహరిబాబు, సీఈఓ మహ్మద్ అలీ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● మండ్య గొడవలపై హిందూ జాగరణ వేదిక ఆందోళన

బళ్లారిరూరల్, సెప్టెంబరు 14: నగరంలో హిందూ జాగరణ వేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. శనివారం రాయల్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం వేదిక సభ్యులు మాట్లాడుతూ మండ్యలో వినాయక నిమజ్జనం సందర్భంగా అల్లర్లు సృష్టించిన వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకుని, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హిందూ జాగరణ ఉత్తర కర్ణాటక సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ మండ్యలో వినాయక నిమజ్జనం అల్లర్లకు పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేయాలని నినాదాలు చేస్తూ అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అర్జున్‌సింగ్, భరత్, సోనీ, గోవిందు, మల్లికార్జున, చంద్ర, శివమూర్తి హిందూజాగరణ సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీలో జాగరణ సభ్యులు

కృషిపత్తిన సహకార సంఘ లాభం రూ. 31.22 లక్షలు



విద్యార్థులను సన్మానిస్తున్న సభ్యులు

కంప్లి, సెప్టెంబరు 14: తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు ప్రాథమిక కృషిపత్తిన సహకార సంఘం రూ.30 లక్షల లాభాలు గడించిందని కార్యదర్శి పేర్కొన్నారు. శనివారం సంఘం 74వ వార్షికోత్సవ మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి జడేష్ రెడ్డి 2023-24 సంవత్సరం నాటి లావాదేవీలు, విషయలపై చదివి వినిపించారు. ఈ సొసైటీలో 3,875 మంది సభ్యులున్నారన్నారు. రైతులకు, వ్యాపారస్తులకు ప్రాథమిక కృషి పత్తిన సహకారం నుంచి ఎంతో సౌలభ్యం వుందన్నారు. రూ. 67.27 లక్షల రసాయనిక ఎరువులు తీసుకువచ్చి రైతులకు అందించామన్నారు. ఇప్పటికే 98 శాతం రుణాలను వసూలు చేశామన్నారు. ఈ యేడాది రూ. 31.22 లక్షల లాభం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహకార సంఘం అధ్యక్షురాలు గుడుదూరు లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రాథమిక కృషి పత్తిన సమకార సంధంలో వండే ప్రతి సభ్యులు అవసరమని సభ్యులు తెలిపారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీడీసీసీ డైరెక్టర్ మూకయ్య స్వామి, నాయకులు ఉలిగప్ప, ఉపాధ్యక్షులు నెల్లూడి ఖాసీమ్‌సాబ్, సభ్యులు బర్గి మహేశ్వర, నాగరాజ, సాయబన్న, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శారద, సదాశివప్ప, ఖాసీమ్‌సాబ్, వడ్రు వీరేష్, కిడ్నీ ఏజెన్సీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ మార్పు ప్రచారం దారుణం

● రాహుల్ గాంధీపై మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ధ్వజం

సిరుగుప్ప, సెప్టెంబరు 14: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రచారం చేయడం సరైంది కాదని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ధ్వజమెత్తారు. శనివారం సిరుగుప్ప పట్టణంలో బీజేపీ కార్యాలయం నుంచి గాంధీజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు, బీసీలకు రాజ్యాంగ మార్చిడి చేస్తారని అమెరికాలో కూడా ప్రచారం చేయడాన్ని ఖండిస్తూ నిరసన పాటించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇంతవరకు ఆ విషయంపై ఎప్పుడు ఎక్కడా మాట్లాడలేదు. దేశ అభివృద్ధి కోసం 400 సీట్లకు పైగా వస్తే ఎలాంటి సమస్యలు లేకుండా బిల్లులు పాసు చేయడానికి సాధ్యపడుతుందనేవారు. ఎందరో మహనీయులు రాసిన రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయులు దరప్పనాయక, అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, కార్యదర్శి కొళగల్ బసవరాజు, బంద్రాల్ మల్లికార్జున, బసవరాజ, లస్కర్ శేకప్ప, మైకేల్ వీరేష, మహదేవ, ఎంఎస్ సిద్దప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్రకార్యదర్శి భగవాన్‌రెడ్డి

పంట దిగుబడులను ప్రభుత్వమే కొనాలి

● రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి భగవాన్ డిమాండ్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 14: రాష్ట్రంలో రైతులు సాగు చేస్తున్న పంటలన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి భగవాన్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న రైతుల పోరాటానికి అనుబంధంగా ఈనెల 23న ఢిల్లీ వెళ్తున్నట్లు తెలిపారు. రైతుల అన్ని పంటలకు సీ2+50శాతం చొప్పున కనీస మద్దతుధర ఇవ్వాలన్నారు. విద్యుత్ చట్టం 2023 అమలు చేయాలని కోరారు. ఢిల్లీ రైతు పోరాటంలో అమరులైన రైతుల పేరిట సరిహద్దులో అమరవీరుల స్థూపాన్ని నిర్మించాలన్నారు. 60ఏళ్ల పైబడిన రైతులకు పించన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు అన్ని గ్రామాలు, తాలూకా, జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు అందరూ కలిసి కట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోవింద్, కాసీంసాబ్, కురుగోడు తాలూకా అధ్యక్షుడు లింగప్ప, బళ్లారి తాలూకా అధ్యక్షుడు ఈరన్న, కార్యదర్శి ధనరాజ్, జిల్లా కమిటీ సభ్యులు మల్లప్ప, హొన్నూరప్ప, రమేశ్, బసవరాజ్, తిప్పయ్యరైతుతు పంపాపతి, హనుమంతప్ప, హులుగప్ప, శర్మ, ప్రభు, అయ్యలప్ప, మల్లికార్జున, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల స్థితిగతులపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిద్దలింగ స్వామీజీ

బళ్లారి సిటీ,సెప్టెంబరు 14: లంబాడీల ఆర్థిక స్థితిగతులు వారి వృత్తి, సంచార జీవితం కళ్లకు కట్టినట్లుగా డా.లక్ష్మనాయక్ పుస్తకాన్ని రాశారని సిద్దలింగస్వామీజీ కొనియాడారు. శనివారం నగరంలోని హీరా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చే సిన కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. లంబాడీ వారు పడే కష్టాలు, జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి వివరించారని పేర్కొన్నారు. డాక్టర్. లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను సమాజానికి లంబాడీ సమాజానికి చేయూతగా వారి స్థితిగతులపై పీహెచ్‌డీ చేశానన్నారు. ఈసందర్భంగా సర్దార్ సేవాలాల్ స్వామీజీ , తిప్పేస్వామి స్వామీజీ, డా.రవికుమార్, కృష్ణనాయక్, ప్రొఫెసర్ శాంతకుమార్, విజయ్‌కుమార్, రంగనాథ్ పాల్గొన్నారు.

భూములకు ఆధార్ లింక్ తప్పనిసరి

కంప్లి, సెప్టెంబరు 14: గ్రామాల్లో, పట్టణాల్లో భూముల పట్టాలకు రైతులు ఆధార్ లింకు తప్పనిసరిగా చేయించాలని తహసీల్దార్ గురురాజు సూచించారు. జిల్లా పరిధిలోని కుడితిని గ్రామంలో శనివారం రైతులు భూమి పట్టాలకు ఆధార్ లింకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూమిపట్టాలకు ఆధార్ లింకు లేకపోతే భూముల్లో వేసుకున్న పంటలు దెబ్బతింటే ప్రభుత్వ సాయం అందదన్నారు. ప్రతి రైతు ముందుకొచ్చి తమ భూములకు ఆధార్ లింకు చేయించినట్లయితే అన్ని సౌకర్యాలు పొందుతారన్నారు. శనివారం 50కి పైగా ఆధార్ లింకు చేసినట్లు తెలిపారు. గ్రామ లెక్క అధికారి జావెద్ ఖురేష్, రైతన్నలు తదితరులు పాల్గొన్నారు.



భూముల ఆధార్ లింకు కార్యక్రమంలో తహసీల్దార్ గురురాజు

హామీల అమలుకు కృషి : ఎమ్మెల్యే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు సెప్టెంబరు 14 : గతంలో తాను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు మరింత నిబద్ధతతో కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హిరాపూర్ గ్రామంలో పాఠశాల నూతన భవన నిర్మాణానికి తన హయాంలోనే శంకుస్థాపన చేసి తానే తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. శనివారం హిరాపూర్ గ్రామంలోని పాఠశాల నూతన భవనాన్ని, ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గారలదిన్నిలో రూ.3.80 కోట్లతో నిర్మిస్తున్న ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వార ప్రజలకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా శోభాయాత్ర

రాయచూరు సెప్టెంబరు 14: వినాయక శోభాయాత్రను శనివారం అట్టహాసంగా ఊరేగించారు. నిమజ్జనం కోసం ఏడవ రోజైన శుక్రవారం రాత్రి తరలించగా శోభాయాత్ర శనివారం వరకు కొనసాగింది. శోభాయాత్రలో పాల్గొన్న స్థానిక రంభపురి సోమనాథ శివాచార్య స్వామి, గణేశ్ విగ్రహాలకు పూజలు నిర్వహించి శోభయాత్రను లాంచనంగా ప్రారంభించారు. పూజలో మాజీ ఎంపీ కే విరుపాక్షప్ప, బీజేపీ నాయకులు, నగరసభ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సింధనూరు నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన శోభయాత్రకు స్థానిక నటరాజ్ సర్కిల్ వద్ద జైన సమాజానికి చెందిన ప్రతినిధులు అక్కడికి చేరుకుని ఉత్సవ మూర్తికి ఘన స్వాగతం పలుకుతూ ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు శీతల పానియాలు అందజేశారు. ప్రత్యేక అలంకరణతో భాజభజంత్రిలు,మేళ తాళాలు, డీజే సౌండ్‌ల నృత్యాలతో కురింతలతో సాగిన శోభయాత్ర ప్రశాంతంగా ముగిసింది.



ముస్లింలకు స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం

హొసూరు జోన్

ఆర్టీఓ అధికారుల తనిఖీ

హోసూరు సెప్టెంబరు 14 : కృష్ణగిరి టోల్ బూత్ సమీపంల్లో చెన్నై రవాణా శాఖ కమీషనర్ సురేశ్ నేతృత్వంల్లో శనివారం రాత్రి 8 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు ఓమ్నీ బస్సుల ప్రత్యేక తనిఖీ జరిగింది. ఇందుల్లో వేలూరు జిల్లా రవాణా అధికారి , హోసూరు జిల్లా రవాణా అధికారి, వాణియంబాడి జిల్లా రవాణా అధికారి , కృష్ణగిరి జిల్లా రవాణా అదికారి, రాణిపేట జిల్లా రవాణా అధికారి, ప్రాసెసింగ్ డివిజన్ జిల్లా రవాణా అధికారులు , ఇన్‌స్పెక్టర్లు సమక్షంల్లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించారు. పన్ను చెల్లించకుండా, సరైన పత్రాలు లేకుండా నడిపిన 41 వాహనాలకు తనిఖీ రిపోర్టు అందించారు. జరిమానం పీసులు రూ.1 లక్ష 10వేలు, రూ.2 లక్షల 48 వేలు 370 వసూలు చేశారు, ఇందుల్లో సరైన దస్తావేజులు లేకపోవడంతో వినాయక కంపెనీకి చెందిన రెండు ఓమ్నీ బస్సులు, పన్ను చెల్లించని ఓమ్నీ బస్సు మొత్తం మూడు ఓమ్నీ బస్సులను సీజ్ చేశారు, ఇందుల్లో ప్రయాణించే ప్రత్యామ్నాయ బస్సులను సొంతం చేసుకున్నారు. అలాగే బస్సుల్లో ప్రజలను రెచ్చగొట్టడం, దుర్భాషలాడడం, రవాణా శాఖ అధికారులను బెదిరించడం, అధికారులను బెదిరించడం వంటి వాటిపై వినాయక ట్రావెల్స్ ఓమ్ని బస్సు యజమాని క్రిష్‌కుమార్, మేనేజర్ మురుగన్‌లపై కేసు నమోదు చేశారు. దీనిపై వెంకటరాఘవన్ హోసూరు ఓలీసు స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు, అలాగే సరైన పత్రాలు లేకుండా నడిపే ఓమ్నీ బస్సులను పన్ను చెల్లించకుండా స్వాధీనం చేసుకుంటామని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

వంటశాల ప్రారంభం

హోసూరు, సెప్టెంబరు 14: హోసూరు సమీపంల్లోని మత్తిగిరి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో వంటశాల ప్రారంభోత్సవం జరిగింది, హోసూరు పట్నం మత్తిగిరిల్లో నూతనంగా నిర్మించిన వంటశాల ప్రారంభోత్సవం శనివారం జరిగింది, హోసూరు డీఎంకే కౌన్సిలర్ మంజుల మునిరజ్ రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకమంల్లో చీఫ్ ఎడిటర్ కవిత, డీఎంకే ఆదిద్రావిడర్ వెల్ఫేర్ కమిటీ కృష్ణగిరి పశ్చిమ జిల్లా ఆర్గనైజర్ మునిరాజ్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కలైవాణి, సురేశ్, అంగన్‌వాడీ ఆర్గనైజర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ల పంపిణీ

హోసూరు, సెప్టెంబరు 14 : హోసూరులో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా హెల్మెట్లు ధరించడంపై అవగాహన కల్పించారు. శ్రీ చంద్రశేఖర హాసిపటల్ తరపున కృష్ణగిరి జిల్లా ఎంపీ.గోపినాథ్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లను అందజేశారు. ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14 న జరుపుకుంటారు, ఇందుకు సంబంధించి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందుకు అనుగుణంగా కృష్ణగిరి జిల్లా హోసూరుల్లో శ్రీ చంద్రశేఖర ప్రైవేట్ ఆసుపత్రి తరపున ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా హెల్మెట్ ధరించి మన ప్రాణం మన చేతుల్లో అని అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. హోసూరు - బాగలూరు రహదారిల్లో ఉన్న ఆసుపత్రి ఎదుట నిర్వహించిన కార్యక్రమానికి కృష్ణగిరి పార్లమెంటు సభ్యుడు కె.గోపినాథ్ హాజరై తలకు కవచం ధరించడంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చంద్రమౌళి, న్యూరాలజిస్ట్ అబిద్, ఇన్‌స్పెక్టర్ ముత్తమిళసెల్వన్, ట్రాఫిక్ పోలీస్ ఎస్ఐ సత్య తదితరులు కూడా హెల్మెట్లు ధరించడం అవశ్యకతపై అవగాహన కల్పించారు. దీనిని అనుసరించి యమధర్మరాజు వేశాధారణ చేసుకుని హెల్మెట్లు అందజేశారు. దీంతో హెల్మెట్లు లేకుండా వచ్చిన వాహనదారులకు పిలిపించి అందజేశారు. ఈ కార్యక్రమంల్లో పాల్గొన్న ఎంపీ గోపినాథ్ హెల్మెట్లు పంపిణీ చేశారు.



హెల్మెట్లు అందజేస్తున్న ఎంపీ గోపీనాథ్

ఫ్లైఓవర్ పనులతో ట్రాఫిక్ జామ్

హోసూరు(సిప్‌కాట్) సెప్టెంబరు 14: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ జూజూవాడీ సిప్‌కాట్ ఫేస్ 1ల్లో జాతీయ రహదారి ఫ్లైఓవర్ పనులు కొనసాగుతున్నందున సిప్‌కాట్ ప్రాంతంల్లో సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజా వాహనదారులు నానా అవస్థలు పడ్డారు, వారాంతపు రోజు, వారంల్లో మొదటి రోజు, ఉదయం మరియు సాయంత్రం ఈ ప్రాంతంల్లో ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంటుంది, హోసూరు బెంగళూరు జాతీయ హైవేలో లక్షలాది వాహనాలు వచ్చి వెళ్లే రహదారి ట్రాఫిక్ జామ్‌లలో 1 కి.మీ ప్రయాణించడానికి గంటల సమయం పడుతుంది, జాతీయ రహదారిపై వాహనాలు వెళ్లడంతో ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులు అసౌకర్యానికి గురవుతున్నారు. శనివారం అత్తిపల్లి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి హోసూరు వరకు దాదాపు 5 కిలోమీటర్లు మేర రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు, కార్లు, జీపులు, టెంపోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. అదేవిధంగా ఈ సమయంల్లో ఆంబులెన్స్ వాహనం కూడా ట్రాఫిక్ జామ్‌ల్లో ఇరుక్కుపోవడంతో పోలీసులు ఎంతో శ్రమించి ఆంబులెన్స్ వాహనం వెళ్లేందుకు దారిని ఇచ్చారు. నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే ఈ రోడ్డుల్లో ఫ్లైఓవర్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రజా వాహనదారులు కోరుతున్నారు.



ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

వైద్యశిబిరం

హోసూరు సెప్టెంబరు 14: సెయింట్ పీటర్స్ వైద్య కళాశాల, కేసీసీ నగర్ వెల్ఫేర్ అసోసిషియన్ తరపున వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేసీసీ నగర్ వినాయక ఆలయం వద్ద నిర్వహించారు. వెల్ఫేర్ అసోషేషియన్ ఛైర్మెన్ శేఖర్‌బాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంల్లో వైస్ ప్రెసిడెంట్ ఏ.మురుగన్ అందరికి స్వాగతం పలికారు. కార్యదర్శి సెందిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు శంకర్‌కుమార్, కార్యక్రమంల్లో వెంకటేశన్, భాస్కర్, సభాపతి, జ్యోతి నేతృత్వంల్లో ఈ శిబిరం జరిగింది, ఈ శిబిరంలో మధుమేహం చికిత్స, రక్తపోటు, ఊపిరితిత్తులు వ్యాధులు, కీళ్లనొప్పులు, చెవి, ముక్కు, గొంతు వ్యాధుల పరీక్షలు, కంటి పరీక్ష, చర్మ వ్యాధుల చికిత్స అని అన్నిరకాల వ్యాధులకు ఉచిత వైద్య సంప్రదింపులు, చికిత్సలు జరిగింది, ఈసీజీ, కూడా నిర్వహించారు. శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సమగ్ర బీమా పథకం క్రింద ఉచిత డయాలసీస్ చికిత్సకు సిపారస్సుల కోసం ఆ కార్డును తీసుకురావాలని కోరారు, ఈ అరుదైన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఒక్కరోజు ముందుగానే వాహనాల్లో స్పీకర్ల ద్వారా తెలియజేశారు.



శిబిరంలో పేర్ల నమోదు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కె.శె. శంకరనారాయణ కాలమ్...

ఓనం పండుగ



కేరళ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ. మలయాళీ కాలగణనలో మొదటి నెల అయిన చింగంలో ఓనం వస్తుంది. పదిరోజులపాటు పండుగ కొనసాగుతుంది. కేరళ యొక్క ఆచారములు, సంప్రదాయాలతో ముడిపడి ఉంటుంది. చక్కటి పూల మాలలు, భోజనం, సర్పాకారపు పడవ పందేలు, కైకొట్టికలి నృత్యం పండుగలో భాగంగా గురువాయూరప్పన్‌ను కొలుస్తారు.

సర్ ఎం విశ్వేశ్వరయ్య (జయంతి)



'భారతరత్న' గ్రహీత సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1860 సెప్టెంబరు 15న కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళాపుర జిల్లా ముద్దేనహళ్ళిలో జన్మించారు. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మోక్షగుండం గ్రామానికి చెందినవారు. మైసూరు సంస్థానంలో దివాన్‌గా వ్యవహరించి కన్నడ భాషాభివృద్ధికి పరిషత్‌ను ఏర్పాటు చేశారు. మైసూరు దివాన్‌గా ఆయన సేవలకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు ఇచ్చింది. కృష్ణ రాజసాగర్ డ్యామ్‌కు చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించారు. హైదరాబాద్ నగరానికి మూసీ నది వరదలనుంచి కాపాడేలా కాలువల నిర్మాణంలోనూ, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. జలవనరుల పెంపుకోసం దోహదపడ్డారు. ఆయన జయంతిని ఇంజనీర్ల దినోత్సవంగా ఆచరిస్తున్నారు. 101వ యేట 1962 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

శరత్‌చంద్ర ఛటర్జీ (జయంతి)



బెంగాలీ నవలా రచయిత శరత్ చంద్ర ఛటోపాధ్యాయ (ఛటర్జీ) 1876 సెప్టెంబరు 15న హుగ్లి జిల్లా దేబానందపూర్‌లో జన్మించారు. 20వ శతాబ్దంలో చిన్నకథల రచయితల్లో తనదైన గుర్తింపు పొందారు. సామాజిక అంశాలతో కూడి ఉంటాయి. ఆయన బెంగాలీలో రచించిన 'దేవదాస్' నవల 16 రకాలుగా రూపొందింది. 50కుపైగా నవలలు పలు భాషలలో సినిమాలుగా రూపొందాయి. 1938 జనవరి 16న కన్నుమూశారు.

అగథ క్రిస్టీ (జయంతి)




డేమ్ అగథ మేరీ క్లారిసా క్రిస్టీ 1890 సెప్టెంబరు 15న యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలోని టోర్క్వేలో జన్మించారు. 66 డిటెక్టివ్ నవలలు, 14 చిన్నకథలు రాశారు. 'ది మౌస్ ట్రాప్' అనే నాటిక 1952 నుంచి నిరంతరంగా 2020వరకు లండన్‌లోని వెస్టె ఎండ్‌లో ప్రదర్శించబడింది. కొవిడ్ ప్రభావంతో నాటిక ప్రదర్శన చేయలేదు. ఆమె నవలలు 200కోట్లకు పైగా ప్రతులు అమ్ముడై 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు. మిస్టరీ రైటర్స్ ఆఫ్ అమెరికాచే గ్రాండ్ మాస్టర్ అవార్డును అందుకున్న తొలి మహిళ. సాహితీసేవలకు డీబీఈలో గుర్తింపు లభించింది. ఆమె నవలలు సినిమా, బుల్లితెర, బీబీసీ రేడియో, వీడియో గేమ్ సిరీస్‌లోను చోటు దక్కించుకున్నాయి. 1976 జనవరి 12న కన్నుమూశారు.

అణ్ణాదురై (జయంతి)



'అణ్ణా'గా పేరొందిన తమిళనాడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాంజీవరం నటరాజన్ అణ్ణాదురై 1909 సెప్టెంబరు 15న జన్మించారు. తమిళ సాహిత్యానికి ఎంతో కృషి చేశారు. డీఎంకే పార్టీ సంస్థాపకులు. దేశంలో కాంగ్రెసేతర పార్టీ అయిన డీఎంకే పూర్తి మెజారిటీ చేపట్టిన తొలి ప్రభుత్వం ఆయనదే కావడం విశేషం. రచయితగాను, నాటకరంగంలోనూ, సినీ రంగంలోనూ తనదైన ప్రతిభను చాటుకున్నారు. అన్ని రంగాలలో స్ఫూర్తిగా నిలిచిన నాయకుడిగా పేరొందారు. 1969 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

బూర్గుల రామకృష్ణారావు (వర్ధంతి)



రామకృష్ణారావు 1899 మార్చి 13న అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా) కల్వకుర్తి సమీపాన పడకల్ గ్రామంలో జన్మించారు. స్వగ్రామమైన బూర్గుల నామంతోనే పేరొందారు. బహుభాషావేత్త, రచయిత, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు. న్యాయవాదిగా ఉంటూనే రాజకీయాల్లో రాణించారు. నిజాం పాలనకు స్వస్తి పలికిన అనంతరం 1952లో ప్రజాప్రభుత్వంలో హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. కేరళ రాష్ట్ర తొలి గవర్నర్‌గా, ఉత్తరప్రదేశ్ 4వ గవర్నర్‌గాను రాణించారు. సాహితీవేత్తగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1967 సెప్టెంబరు 15న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం 2000లో పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

డాక్టర్ సుబ్రమణియన్ స్వామి (పుట్టినరోజు)



ప్రముఖ రాజకీయనాయకుడు, ఆర్థిక వేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి 1939 సెప్టెంబరు 15న చెన్నైలోని మైలాపూర్‌లో జన్మించారు. ఐఐటీ ఢిల్లీలో ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. 2016 నుంచి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. బీజేపీలో చేరకముందు జనతాపార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా, లేబర్ స్టాండర్స్ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించారు. విదేశీ వ్యవహారాలు ఇతర అంశాలపై ఎన్నో పుస్తకాలు, జర్నల్స్ రాశారు.

రమ్యకృష్ణ (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖనటి రమ్యకృష్ణ 1970 సెప్టెంబరు 15న చెన్నైలో జన్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ భాషలలో 260కుపైగా సినిమాలలో నటించారు. మూడు నంది అవార్డులతోపాటు నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, ఇతర అవార్డులు అందుకున్నారు. భరతనాట్యం, కూచిపూడిలలో రాణించి నృత్యకారిణిగా పలు స్టేజ్ షోలు ప్రదర్శించారు. బాహుబలి సినిమాలో శివగామి పాత్ర పేరొందింది. సినీ దర్శకుడు కృష్ణవంశీని పెళ్లాడారు.

బలవంతపు హిందీని సహించం

▸▸ కరవే ఆధ్వర్యంలో నిరసన

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేసిన తర్వాత కూడా స్థానికంగా ఆయా రాష్ట్రాల భాషలకు కాకుండా బలవంతంగా హిందీని రాష్ట్రంలో రుద్దే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్న కర్ణాటక రక్షణా వేదిక (కరవే) పేర్కొంది. నగరంలోని ఫ్రీడంపార్కులో శనివారం భారీ నిరసన తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.



బెంగళూరు ఫ్రీడంపార్కులో కరవే ఆధ్వర్యంలో నిరసన

బాగేపల్లిలో బ్లాక్ డే

బాగేపల్లి, సెప్టెంబరు 14: కరవే పిలుపుతో పట్టణంలోని గూళూరు సర్కిల్‌లో బైక్ ర్యాలీ



బాగేపల్లిలో బైక్‌ర్యాలీ

నిర్వహించారు. భుజాలకు నల్లటి పట్టీలు కట్టి బ్లాక్‌డే ఆచరించారు. ఈ సందర్భంగా హిందీ దివస్‌ను కేంద్రప్రభుత్వం పాటించడాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ దేశంలో 22 పాలనాభాషలు ఉండగా కేంద్రప్రభుత్వం మాత్రం హిందీ వారోత్సవం, హిందీ దివస్ జరపడాన్ని ఖండించారు. పలు పోటీ పరీక్షల్లో హిందీని బలవంతంగా చేర్చారన్నారు. వివిధ బ్యాంకులలో కన్నడభాషకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాము హిందీకి వ్యతిరేకం కాదని అయితే బలవంతంగా హిందీని కన్నడిగులపై రుద్దే యత్నం చేయడాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. బ్యాంకు డిజిటల్ నామఫలకాలు, ఏటీ ఎంలు, అర్జీలలో కన్నడకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిరసనలో కరవే తాలూకా ప్రధాన కార్యదర్శి రియాజ్‌వుల్లా పట్టణ విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా విభాగం తాలూకా అధ్యక్షురాలు గంగరత్నమ్మ, సంచాలకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడు సర్ ఎం విశ్వేశ్వరయ్య

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడు సర్ ఎం విశ్వేశ్వరయ్య అని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ ఎం ఆర్ సీతారాం అభిప్రాయపడ్డారు. రామయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సర్ ఎం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. పద్మవిభూషణ్ డాక్టర్ వికె ఆత్రె, జీకేవీకే ప్రొఫెసర్ ఎం నటరాజ కరబలను ఇదే సందర్భంగా సత్కరించారు. డాక్టర్ ఎంఆర్ సీతారాం మాట్లాడుతూ దేశంలో చారిత్రాత్మక కట్టడాలకు సర్ ఎం విశ్వేశ్వరయ్య ఆలోచనలు ఉన్నాయన్నారు. సుస్థిర అభివృద్ధి, పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, భూమిని రక్షించాలన్నారు. ఐఎస్ఏఇ బెంగళూరు విభాగం చైర్మన్ ప్రొఫెసర్ గోపాలకృష్ణన్, రామయ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కేఎస్ గణేశయ్య, ప్రొఫెసర్ ఎంఎన్ తిమ్మేగౌడ, ఐఐఎస్‌సి ప్రొఫెసర్ టివి రామచంద్రలు భాగస్వామ్యులయ్యారు. బెంగళూరు, మైసూరులకు చెందిన 9ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధనాపత్రాలను సమర్పించారు. ఉత్తమ ప్రతిభావంతులు నలుగురికి నగదు బహుమతి అందించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాం తదితరులు

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 14: తాలూకాలోని మళ్ళూరు శివారులోని సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవం మూడోరోజు ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ధార్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హోమం కోసం ముత్తైదువులు దీపాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. సుమారు కిలోమీటరు మేర ఊరేగింపు సాగింది. నరసింహస్వామి దేవాలయానికి వెండి పల్లకీ ఉత్సవం జరిగింది. కుంభాభిషేకంలో శ్రీమాతా అప్పాజి నేతృత్వంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. ఆలయ ధర్మాధికారి నారాయణస్వామి మాట్లాడుతూ భక్తుల అభిరుచికి అనుగుణంగా ప్రతి సంవత్సరం కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ధార్మిక ప్రసంగం

క్రమశిక్షణకు మారుపేరు మోక్షగుండం

▸▸ పీఈఎస్‌లో బీటెక్ తరగతుల ప్రారంభం

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, సమయపాలనకు మారుపేరు భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీ క్యాంపస్‌లో బిటెక్, ఆర్కిటెక్చర్ అకడమిక్ కోర్సులను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. పూర్వ విద్యార్థి, విప్రో చైర్మన్ హరీశ్ ద్వారకనహళ్ళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ దొరస్వామి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య చారిత్రాత్మకమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. ఆయన ప్రపంచస్థాయిలో చిరస్మరణీయులన్నారు. ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. కళాశాలలో ఇంజనీరింగ్‌లో రాణించేవారికి ఏటా రూ.5కోట్ల దాకా ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. యువత, నవభారత రూపురేఖలు మార్చేలా ఎదగాలని ఆకాంక్షించారు. హరీశ్ ద్వారకనహళ్ళి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై లక్ష్యంతోపాటు నైపుణ్యతలో రాణించే మెలకువలలో ముందంజలో ఉండాలన్నారు. సృజనశీలత, విమర్శనాత్మకమైన ఆలోచనలు, విశ్లేషణాత్మక అవగాహనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పరుగులు తీస్తోందని అందుకు అనుగుణంగా ముందుకెళ్తేనే ప్రపంచస్థాయిలో పోటీ పడేందుకు సాధ్యమన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జె సూర్యప్రసాద్, సీఓఓ ప్రొఫెసర్ అజయ్‌కుమార్, సీటీఓ డాక్టర్ హర్ష చతుర్వేది, ప్రొ వైస్‌చాన్స్‌లర్ నాగార్జున సాదినేని, రిజిస్ట్రార్ కేఎస్ శ్రీధర్‌లు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఓరియంటేషన్‌లో ప్రొ-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ విద్యార్థులకు మెళకువళలు, శిక్షణా విధానాన్ని వివరించారు.



బిటెక్ కోర్సుల ప్రారంభంలో పీఈఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి తదితరులు

దుస్థితిలో పశువైద్య కేంద్రం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 14: ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి ముగళూరు గ్రామంలో నిర్మించిన పశువైద్య కేంద్రం నాలుగేళ్లకే దుస్థితికి చేరుకుంది. సుమారు 34 లక్షల రూపాయల అంచనాతో నిర్మించిన భవనం తక్కువ సమయంలోనే శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్థులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఈ ప్రదేశం అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. 10 కిటికీల అద్దాలు పగులగొట్టి వాటికి ఉంచిన అల్యూమినియం డోర్‌ను చోరీ చేశారు. ఔషధాలను చెల్లాచెదరు చేశారు. కొంతమంది మందుపార్టీ చేసుకుని అక్కడి ఫ్యాన్లను చోరీ చేశారు. కాగా నీటి తొట్టెను సైతం మలమూత్రాదులు విసర్జించారని డి గ్రూప్ ఉద్యోగి అశ్వథ్ ఆరోపించారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 8న సర్జాపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు పర్యవేక్షణ లేక సీలింగ్ పెచ్చులూడగా, గోడలు నెర్రెలు వచ్చాయి. అయినా పోలీసులు, పంచాయతీ అభివృద్ధి అధికారి కూడా పశువైద్య కేంద్రం పట్ల పర్యవేక్షణకు చొరవ చూపలేదని గ్రామస్థులు అంటున్నారు. ముగళూరు పశువైద్యకేంద్రం 14 గ్రామాలకు చేరినది. ముగళూరు, పండిత్ అగ్రహార, మట్నహళ్ళి, రాజీవ్‌గాంధీ నగర్, దొడ్డతిమ్మసంద్ర, గోణిఘట్టపుర, కామనహళ్ళి, చిక్కనహళ్ళి, కూగూరు, బనహళ్ళి, దేశ్‌పాండే, గుట్టహళ్ళి, మాదనప్పనహళ్ళి ఇలా 14 గ్రామాలలో సుమారు 1350 పశుపక్ష్యాదులు ఉన్నాయని వీటికి ఔషధాలు సమకూర్చాల్సి ఉందని డాక్టర్ రాధాకృష్ణరావ్ తెలిపారు. నలుగురు సిబ్బందికిగాను ఇద్దరు పనిచేస్తున్నారని డి గ్రూప్ ఉద్యోగి, సహాయకులు లేకనే కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యమైన రికార్డులు ఉంచాల్సిన బీరువా తుప్పు పట్టిందని, భద్రత కరువైందని డాక్టర్ వాపోయారు.



ముగళూరులోని పశువైద్య కేంద్రం ఇదే..



నెర్రెలు చీలిన గోడ



పెచ్చులూడిన సీలింగ్

ఉపాధ్యాయుడు ఆదర్శప్రాయంగా ఉండాలి

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు భావిభారత పౌరులను తీర్చే ఆదర్శప్రాయంగా ఉండాలని ప్రముఖ హాస్య కళాకారుడు ప్రొఫెసర్ కృష్ణేగౌడ అభిప్రాయపడ్డారు. కృష్ణ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. విద్యానిపుణుడు ప్రొఫెసర్ హరినాథ్, వైస్‌చైర్మన్ జలజమ్మ, డైరెక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ కమలా సుగంధి, మనోహర్, ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు. కృష్ణేగౌడ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యతోపాటు నైతిక విలువలు నేర్పాలన్నారు. సాంకేతికత పెరుగుతున్న తరుణంలో మానవత్వపు విలువలు కుశించుకుపోతున్నాయని, పెద్దలు, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం పాటించేలా ప్రోత్సహించాలన్నారు. రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా తీర్చే సామర్థ్యం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. ఇదే సందర్భంగా ప్రతిభావంత విద్యార్థులను సత్కరించారు.



ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రముఖులు

నేత్రదానంపై అవగాహన పెంచాలి

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం, నేత్రదానం వంటి సామాజిక అత్యవసరాలపై విద్యార్థులలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అగర్వాల్ ఆసుపత్రి ముఖ్యులు డాక్టర్ అమోద్‌నాయక్ అభిప్రాయపడ్డారు. ఎంవిజే ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్స్ డీన్ శ్రీనివాస్ ఎల్ గొంబితో కలసి నేత్రదానంపై వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమోద్ నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వేలాదిమంది కార్నియా కోసం వేచియున్నారన్నారు. అవగాహన లేకపోవడం ద్వారానే నేత్రదానం సకాలంలో జరగడం లేదన్నారు. యువతలో చైతన్యం రావాలంటే ప్రతి విద్యాసంస్థలోనూ నేత్రదానంపై అవగాహన పెంచాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అగర్వాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వాకథాన్

సీఎంతో తెలంగాణ ఎంపీ భేటీ



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ మల్లు రవి

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్యను తెలంగాణ ఎంపీ మల్లురవి భేటీ అయ్యారు. బెంగళూరులో శనివారం సీఎం అధికారిక నివాసం కావేరిలో కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురూ చర్చించారు.

మడకశిరకు పారిశ్రామిక వాడ

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బృందానికి కేంద్రమంత్రి కుమారస్వామి హామీ



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల

బెంగళూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి భరోసా ఇచ్చారు. బెంగళూరులోని జేడీఎస్ పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రిని శనివారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కలిశారు. కుమారస్వామి మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిరలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా పక్కనే కర్ణాటకలోని వెనుకబడిన ప్రాంతాలైన శిర, మధుగిరి, హిరియూరు, పావగడ ప్రజలకు ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. పరిశ్రమల శాఖ తరఫున అన్నివిధాలా సాయం చేస్తానన్నారు. శాఖాపరంగా చర్చలు జరుపుతానన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి, ఉద్యోగాలు మెరుగువుతాయన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. మడకశిర పరిసర ప్రాంతాలకు చెందిన యువత వేలాదిమంది బెంగళూరులో పనిచేస్తున్నారన్నారు. మడకశిర ప్రాంతంలోనే 3వేల ఎకరాల భూమి ఉందనీ, పెనుకొండ, శిరవైపు జాతీయ రహదారులు అనుబంధంగా ఉన్నాయన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారానే వెనుకబడిన మడకశిర అభివృద్ధి సాధ్యమన్నారు. అదే సమయంలో మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడను మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలిశారు.



మాజీ ప్రధాని దేవెగౌడతో..

అభివృద్ధి, సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

రాయచూరు సెప్టెంబర్ 14: రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ అన్నారు. తాలూకాలోని అంజళ గ్రామంలో కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి మైక్రో నిధులు రూ.3 కోట్లతో చేపట్టే పాఠశాల భవన నిర్మాణానికి శనివారం ఆమె భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తాను ఇప్పటికే అన్ని విధాలా ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిపారు. పార్టీలు వేరైనా తాను జిల్లా పర్యటనకు వచ్చే ప్రతి మంత్రిని, రాష్ట్రంలో ప్రతి శాఖకు చెందిన మంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తున్నట్లు వివరించారు. విద్యాపరంగా, అభివృద్ధిలో వెనకబడిందన్న అపవాదు నుంచి దేవదుర్గను తొలగించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నానన్నారు. ఈ విషయంలో స్థానికంగా తనకు అన్ని రాజకీయ పార్టీల నాయకుల నుంచి సహకారం అందుతున్నట్లు చెప్పుకొచ్చారు.